క్లుప్తంగా

ఆలయ అర్చకులకు సంక్రాంతి కానుకలు



తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయాల అర్చకులకు సంక్రాంతి కానుకల పంపిణీ చురుగ్గా సాగుతోంది. మండలంలోని దేవరపల్లిలోని పలు ఆలయాల అర్చకులకు జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి నూతనవస్త్రాలు, స్వీట్లను ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కొల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న కులగణన



తోట్లవల్లూరు: మండలంలో కులగణన చురుగ్గా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియను గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా కులగణన సర్వే కొనసాగింది. కులగణనను ఎంపీడీఓ తుంగల స్వర్ణలత పర్యవేక్షించారు.

కార్మికులకు న్యాయం చేసేందుకు లెనిన్ కృషి

గుడివాడ టౌన్: కార్మిక, కర్షక వర్గాలకు న్యాయం చేసేందుకు తన జీవితాన్ని ఫణంగా పెట్టిన మహా నాయకుడు వీఐ లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో లెనిన్ వర్ధంతి సభ జరిగింది. తొలుత సీపీఎం నాయకులు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగమల్లేశ్వరరావు, టౌన్ మహిళా కార్యదర్శి రజిని, యూటీఎఫ్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఎస్.ఆంజనేయులు, సీపీఎం నాయకులు సురేంద్ర, కుమారి, పాపారావు పాల్గొన్నారు.

వేగంగా ఇంటర్ కనెక్షన్ పనులు

గుడివాడ టౌన్: స్థానిక గుడ్‌మెన్ పేటలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ రిజర్వాయర్ ఇంటర్ కనెక్షన్ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామని పట్టణ తాగునీటి అభివృద్ధి కమిటీ సభ్యులు కె ఆంజనేయప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన పైప్ కనెక్షన్ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఇంటర్ కనెక్షన్ పూర్తయితే మరింత లోతట్టు ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. గతంలో ఇక్కడ ఉన్న ట్యాంక్ సామర్థ్యం తక్కువగా ఉన్న నేపథ్యంలో దానిని తొలగించి రెండింతలు కెపాసిటీ గల ట్యాంక్ నిర్మించామని ఇప్పటికి 11 వార్డులకు నీటిని సరఫరా చేస్తున్న ఈ ట్యాంక్‌కు ఇంటర్ కనెక్షన్ పూర్తయితే మరిన్ని ఎక్కువ వార్డులకు నీటి సరఫరా ఉంటుందని తెలిపారు. అందుకే ఈ పనులు ప్రారంభించామన్నారు.

కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: స్థానిక ప్రైవేటు విద్యాసంస్థలో చదువుతున్న తన కుమారుడు రెండు రోజులుగా కనిపించడం లేదంటూ ఆ బాలుడి తండ్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లికి చెందిన అబ్దుల్ సలామ్ కుమారుడు అబ్దుల్ మహ్మద్ సల్మాన్ ముదినేపల్లిలోని ప్రైవేటుస్కూల్లో 10వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం సల్మాన్ పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి రాలేదు. పాఠశాలకు సైతం రాకపోవడంతో యాజమాన్యం సల్మాన్ తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం అందించింది. అప్రమత్తమైన తండ్రి సలామ్ బంధువుల ఇంట గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తల తొలగింపునకు చర్యలు

చిలకలపూడి(మచిలీపట్నం): విధులకు హాజరుకాని అంగన్‌వాడీ కార్యకర్తల తొలగింపు ఉత్తర్వులను సోమవారం నుంచి జారీ చేస్తామని కలెక్టర్ పి.రాజాబాబు ఆదివారం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వారితో అనేక సార్లు చర్చలు జరిపిందని, వారి డిమాండ్లలో చాలా వరకు ఆమోదించారని కలెక్టర్ పేర్కొన్నారు. తాను కూడా సంఘాలతో మాట్లాడి సమ్మె విరమించాలని కోరామని, శాఖాపరంగా అధికారులు కూడా పలుమార్లు వారితో మాట్లాడారని తెలిపారు. నిబంధనల ప్రకారం నోటీసులు కూడా జారీ చేశారని వివరించారు. ఆ మేరకు కొంత మంది విధుల్లో జాయిన్ అయ్యారని అటువంటి వారిని మినహాయించి ఇంకా విధుల్లో చేరని వారికి ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు.

రైతన్నకు వ్యవసాయం

వ్యవసాయాన్ని దండగన్నారు గత పాలకులు. పండగ చేసి చూపించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పేరుతో ప్రతి ఏటా పెట్టుబడి సాయాన్ని అందిస్తూ రైతులకు అండగా నిలిచారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా భావించిన సీఎం జగన్ మేనిఫెస్టోలో ప్రకటించిన దానికంటే అదనంగా సాయాన్ని అందిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బందిని నియమించి రైతులకు సేవలను సులభతరం చేశారు.



ముదినేపల్లి మండలం పెదపాలపర్రులో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు (ఫైల్)

రూ.20.5 కోట్ల వైఎస్సార్ రైతుభరోసా జమ

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో 33,756 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయం సాగుతోంది. మొత్తం 14,298 మంది రైతులు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి వ్యవసాయ సాంకేతిక సేవలు, ఎరువులు, పురుగు మందులు, రుణాలు అందించేందుకు నియోజకవర్గంలో 79 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి సాగు, తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాలేదు. ప్రభుత్వ పెట్టుబడి సాయంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

రూ.20,50,56,500 కోట్ల సాయం

కై కలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రూ.20,50,56,500 కోట్ల పెట్టుబడి సాయం కింద గతేడాది అక్టోబరు వరకు వైఎస్సార్ రైతు భరోసాను రైతులకు పంపిణీ చేశారు. మేనిఫెస్టోలో ముందుగా ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లకు రూ.50,000 పెట్టుబడి సాయంగా అందిస్తామని ప్రకటించారు. అటువంటిది ప్రభుత్వం ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ.7,500, రెండో విడత అక్టోబరులో రూ.4,000, మూడో విడత ధాన్యం ఇంటికి చేరే సంక్రాంతి వేళ జనవరిలో రూ.2,000 కలిపి 13,500 అందిస్తున్నారు.



వెంకటాపురంలో రైతు భరోసా కేంద్రం

రైతు సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

దేశంలో ఎక్కడాలేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కౌలు రైతులకు దేవదాయ, అటవీ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా ప్రభుత్వం మూడు విడతల్లో ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఇవే కాకుండా తుపాన్లు, కరువుల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రూ.2,000 కోట్లతో విపత్తు సహాయనిధి, ధాన్యం సేకరణలో గత ప్రభుత్వం రైతులకు బకాయి పడిన వాటిని చెల్లించడం, రైతులకు గిట్టుబాటు ధరకు గ్యారంటీ కల్పించేందుకు రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు.

రైతు భరోసా సాయం ఇలా..

మండలం పేరు	విస్తీర్ణం (ఎకరాలు)	భరోసా కేంద్రాలు	భరోసా సాయం
కైకలూరు	2,454	22	రూ.8,40,90,500
కలిదిండి	1,500	20	రూ.9,31,91,300
మండవల్లి	3,800	16	రూ.1,70,18,100
ముదినేపల్లి	26,000	21	రూ.1,07,56,600
మొత్తం:	33,756	79	రూ.20,50,56,500

వడ్డీల బాధ తగ్గింది



మా గ్రామంలో రెండెకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తున్నాను. మైనార్టీ రైతులకు సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయం అందించారు. ఈ సాయం వల్ల వడ్డీల బాధ తగ్గింది. రైతుల మేలు కోసం ఇంతలా ఆలోచించే సీఎంను చూడలేదు.

– అబ్దుల్ జబ్బార్, కౌలురైతు, అల్లినగరం

రైతుకు సంజీవినిగా భరోసా కేంద్రాలు



గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు రైతులకు సంజీవినిగా మారాయి. పూర్వం మండల కేంద్రాలకు రైతులు వివిధ పనులపై వెళ్లేవారు. నేడు సచివాలయ పరిధిలోనే రైతు భరోసా కేంద్రాల్లో సేవలు అందుబాటులోకి వచ్చాయి. కల్తీ లేని నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, భూసార పరీక్షలు, వాతావరణ సూచనలు వంటివి అందుబాటులోకి వచ్చాయి.

– జి.గంగాధరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు, కైకలూరు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

కాజ(మొవ్వ): రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటరీ వ్యవస్థలను ప్రవేశపెట్టారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం కాజ గ్రామంలో ఆదివారం రూ.43.60 లక్షలతో నిర్మించిన కాజ–1 సచివాలయ భవనాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన వేబ్రిడ్జి, రూ.20 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాలతో పాటు రూ.43.60లక్షల వ్యయంతో నిర్మించిన కాజ–2 సచివాలయ కేంద్రాలను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ మండా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి బాటలోనే మరో నాలుగు అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగాలతో పాటు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామాల్లో మూత బడే పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు నేటి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక సదుపాయాలు, విద్యాప్రమాణాలను అభివృద్ధి చేశామన్నారు. 30 సంవత్సరాలకు పైగా ఉపయోగపడే సామాజిక ఆస్తులను ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయలతో సమకూర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

చెందుతుందన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేసే అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితులు లేవన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడాలి భవాని, పెద్దారాయుడు తోట సర్పంచ్ తాతా స్వప్న, ఎంపీటీసీ సభ్యులు పేకేటి వెంకటలక్ష్మి, యల్లమిల్లి కుటుంబరావు, జెడ్పీటీసీ సభ్యులు రాజులపాటి పార్వతి, వేమూరి పరిశుద్ధరాజు, ఎంపీపీ కొండేటి ఇందిర, మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి కన్వీనర్ జన్ను రాఘవరావు, సచివాలయ మండల కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు పెరుమాళ్లు, ఖాజీ రెడ్డి, బాబ్జిరెడ్డి, సీతారామి రెడ్డి, రామచంద్రరావు, తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీఓ సుధాప్రవీణ్ పాల్గొన్నారు.

శ్రీరాముడికి విశేష పూజలు



జమీదగ్గుమిల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



జమీదగ్గుమిల్లిలో సర్వాలంకారంలో ఆలయంలోని సీతారామచంద్రస్వామి

జమీదగ్గుమిల్లి(పామర్రు): అయోధ్యలో శ్రీరాముడి ఆలయ ప్రతిష్టా మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జమీదగ్గుమిల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం విశేషంగా అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఆలయంలో విశ్వక్సేణారాధన, మండపారాధన, కలశ స్థాపన అనంతరం స్వామికి ఆవుపాలు, ఆవు పెరుగు,ఆవు నెయ్యి, తేనె, పంచదారతో అభిషేకాలను చేశారు. ఆలయప్రాంగణంలో గణపతి హోమం, వాస్తు హోమం, నవ గ్రహ హోమాలను జరిపారు. అనంతరం స్వామికి విశేషంగా నీరాజన మంత్రపుష్పాలను ఇచ్చి వచ్చిన భక్తులకు స్వామి తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఆలయంలో భక్తులు శీతాల శ్రీనివాసరావు విజయఝాన్సీ, కాకర్ల సీతారామాంజనేయదాసు చంద్రావతి దంపతులు పీటలపై కూర్చుని పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో టీ పవన్‌కుమార్, శేషు, ఆలయ కమిటీ సభ్యులు ఆర్ అచ్యుతరావు, యునాని, స్థానికులు ఆర్ ఉమా, విజయలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

రామభక్తుల భారీ ర్యాలీ

గుడివాడ టౌన్: అయోధ్యలో రామమందిర విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో నిర్వహించనున్న విజయోత్సవ మహాసభ విజయవంతం చేయాలంటూ ఆదివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సనాతన ధర్మ



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీరామ భక్తులు

నాదోపాసకుల, బృందాల సమైఖ్య సభ గుడివాడ వారి ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ మహాసభతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సనాతన ధర్మ నాదోపాసకులు పేర్కొన్నారు. పట్టణంలోని 36 వార్డులకు చెందిన రామభక్తులు పెద్ద సంఖ్యలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గల కోదండరామాలయం వద్దకు చేరుకుని అక్కడి నుంచి పట్టణ పురవీధుల్లో ఈ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మండలి హనుమంతరావు, బూరగడ్డ శ్రీనాథ్, చందరాల హరిరాంబాబు, చలమలచర్ల మురళీ కృష్ణమాచార్యులు, విరఘునాథ శాస్త్రి, కఠారి శ్రీవల్లి, జె.వీరవెంకటకుమారి, జి. నిర్మలాదేవి, మందా దీవెన, ఎం.బాలబాలాజి, కూరెళ్ల శ్యామ్, టీఎన్‌వీ సాంబశివరావు, కేవీఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

పామర్రు: వాసవీ క్లబ్, వాసవీ క్లబ్ వనిత పామర్రు నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం స్థానిక శ్రీ బొగ్గరపు జాలయ్య సుబ్బరత్తమ్మ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ క్లబ్ జిల్లా గవర్నర్ కొత్త గణేష్‌బాబు హాజరై నూతన కార్యవర్గ సభ్యులచేత ప్రమాణస్వీకరణ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతపర్చాలన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా ఘంటసాల త్రివిక్రమ సాయిరామ్, ప్రధాన కార్యదర్శిగా చిన్నం మురళీ సుధాకర్, కోశాధికారిగా కంచర్ల వీర జనార్దనరావుతో తొలుత ప్రమాణస్వీకరణ చేయించారు. అనంతరం వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలిగా ఘంటసాల సునీత, ప్రధాన కార్యదర్శిగా చిన్నం జయలక్ష్మి, కోశాధికారిగా కంచర్ల ఉషారాణి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు తొలి సేవా కార్యక్రమంగా



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

వాసవీ వృద్ధాప్య పెన్షన్ పథకాన్ని ప్రారంభించి, పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా కార్యదర్శి శనగపల్లి సురేష్, జిల్లా కోశాధికారి చిట్టూరి శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి రమణ బాబు, జిల్లా వైస్ గవర్నర్ అన్నం సాయి సునీత తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధిచెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైవున్న స్వామిని అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో స్వామి వారి పుట్టలో పాలుపోసి దర్శించుకునేందుకు క్యూలో అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద గోకులంలోని గోవులకు మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. సహాయ కమిషనర్ నేలసంధ్య భక్తులకు అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించారు.

కాలిబాట వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం



ముదినేపల్లి రూరల్: స్థానిక పోలరాజ్ కెనాల్‌పై నిర్మించిన కాలిబాట వంతెనకు ఎట్టకేలకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. ఈ కాల్వపై గతంలో ఉన్న పాతవంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ఐదేళ్ల కిందట గత పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఈ వంతెనను కూల్చివేసి రూ.3 లక్షలతో నూతన కాలిబాట వంతెన నిర్మించారు. వంతెనకు అప్పట్లో అప్రోచ్ రోడ్డు, రైలింగ్ ఏర్పాటు చేయలేదు. దీనివల్ల వంతెన నిర్మించినప్పటికీ వినియోగించుకునే అవకాశం లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. దీనిని గుర్తించిన ప్రస్తుత సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ రూ.1.53 లక్షలతో అప్రోచ్ రోడ్డు నిర్మించడంతోపాటు రెండు వైపులా రైలింగ్ ఏర్పాటు చేశారు. దీంతో వంతెన వినియోగంలోకి వచ్చి ప్రజల అవస్థలు తప్పాయి.

రైతు సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శనీయం

కైకలూరు: రైతు సంక్షేమంలో ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శనీయంగా మారుతోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి పేర్కొన్నారు. వేమవరప్పాడులో రూ.21.60 లక్షల వ్యయంతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ రైతు భరోసా, ఆర్బీకేలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, ఉచిత విద్యుత్ అందిస్తూ రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రైతులు అండగా నిలవాలన్నారు. తాతినేని పద్మావతి మాట్లాడుతూ కేడీసీసీ ద్వారా రైతులకు రుణాలను అందిస్తున్నామన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు



పీఏసీఎస్ భవన కార్యాలయ ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే డీఎన్నార్

భట్రాజు శివాజీ, సర్పంచ్ నున్న రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోడావుల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ జాజుల రాజు, భుజబలపట్నం సర్పంచ్ గురజాల రామ తులసి, నాయకులు మెండ సురేష్‌బాబు, తలారి సత్యనారాయణ, బోడావుల నాగరాజు, తలారి కొండ, బోడావుల రాముడు, భట్రాజు అనిల్, భోగేశ్వరరావు, శ్రీను, లక్ష్మణ్, అప్పయ్య పాల్గొన్నారు.

అడపా బాబ్జీ పార్కులో అధునాతన ఏర్పాట్లు



ఉయ్యాల ఊగుతున్న బాలలు



ఆటలాడుతున్న చిన్నారులు

చిన్నారులను ఆకట్టుకుంటున్న ఎక్విప్‌మెంట్స్

గుడివాడ టౌన్: స్థానిక పెద ఎరికపాడులో నూతనంగా నిర్మించిన అడపా బాబ్జీ చిల్డ్రన్ పార్కు చిన్నారులను ఆకట్టుకుంటోంది. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న పెద ఎరికపాడు పార్కును గత ఏడాది మృతిచెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా వెంకట రమణ(బాబ్జీ) జ్ఞాపకార్థం పురపాలక సంఘ నిధులు రూ.17 లక్షలతో ఆధునికీకరించారు. ప్రత్యేకించి చిన్నారులకు భవిష్యత్‌లో అవసరమయ్యే క్రీడలు, వ్యాయామం వంటి వాటికి తర్ఫీదు ఇచ్చేవిధంగా ఈ పార్కు ఏర్పాటు చేయడం విశేషం. పర్వతాలు ఎక్కేందుకు తర్ఫీదు పొందేలా (క్లైంబింగ్‌వాల్), రోప్‌వేపై పైకి ఎగబాకేందుకు ఉపయోగపడే అధునాతన ఏర్పాట్లు ఇక్కడ చోటుచేసుకున్నాయి. ఇక ఉయ్యాలలు, జారుడు బల్లలు, సామూహిక ఉయ్యాలలు, వాకింగ్ ట్రాక్ చిన్నారులకు ఉపయోగపడే విధంగా డిజిటల్ లైబ్రరీ కోసం నూతన ఆడిటోరియం ఇక్కడ ఏర్పాటు చేశారు. దీంతో సంక్రాంతి సెలవుల్లో చిన్నారులు ఈ పార్కులో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారని తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఆటలపై ఆసక్తి పెరిగింది



పెద ఎరికపాడులో పార్కు ఏర్పాటు చేశాక మా పిల్లల్లో ఆటలపై ఆసక్తి పెరిగింది. గతంలో స్కూల్ నుంచి ఇంటికి వచ్చాక ఎక్కువగా సెల్ ఫోన్ కావాలని వీడియో గేమ్‌లు ఆడుతామని ఇబ్బందులు పెట్టేవారు. అధునాతన వసతులతో పార్కు ఏర్పాటు చేయడంతో పిల్లలు ఖాళీసమయాలలో అక్కడ ఆడుతూ ఆనందంగా గడుపుతున్నారు. ఇది చాలా మంచి పరిణామం. అన్ని చోట్లా ఇలా చేస్తే మంచిది.

– మాచర్ల ఆదిలక్ష్మి, స్థానికురాలు

మరిన్ని పార్కులు ఏర్పాటు చేస్తాం



ఎరికపాడులో నిర్మించిన చిల్డ్రన్ పార్కుకు విశేష స్పందన లభిస్తోంది. రాజేంద్ర నగర్‌లో కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రజలు బాగా వినియోగించుకుంటున్నారు. వీటి ఫలితాలు చూసిన అనంతరం పట్టణంలో మరికొన్ని ప్రాంతాల్లో పార్కులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నాం.

– వి.మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్

ముత్యాలమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కైకలూరు: సర్నాయిపాలెం ముత్యాలమ్మ తల్లికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏటా అమ్మవారికి ఇక్కడ జాతర నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్ రాధాకృష్ణ, నాయకులు సురేష్, రమేష్, నాగభూషణం, బోయిన గోపి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

పెదమద్దాలి(పామర్రు): మండలంలోని పెదమద్దాలి శివారుకొత్తపెదమద్దాలి గ్రామంలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం గణేష్, అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నూతన విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రతిష్టా చార్య గూడూరు సంపత్ శర్మ ఆధ్వర్యంలో చేశారు. గణేష్ విగ్రహాన్ని స్థానికులు ఆవులూరి వెంకటేశ్వరరావు వీర రాఘవమ్మ దంపతులు అందజేయగా, అభయాంజనేయస్వామి విగ్రహాన్ని దాజుపల్లి యల్లమంద, మాణిక్యమ్మ, శివ నాగేశ్వరరావు కృష్ణకుమారి దంపతులు బహూకరించారు. పై దంపతులు పీటలపై కూర్చుని విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. కార్యక్రమంలో నవులూరి వీర వెంకయ్య, నాగమణి దంపతులు అభిషేకరం చేశారు. అన్న సమారాధన చేసి ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్న దాతలు

చెత్త శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక బృందం పరిశీలన

కై కలూరు: పంచాయతీ పరిధిలో తీవ్ర సమస్యగా మారిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శాశ్వత పరిష్కారాలు కనుగొనేందుకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో తమిళనాడుకు చెందిన ప్రాజెక్టు మేనేజర్ వి.శ్రీనివాసన్ కైకలూరులో ఆదివారం పర్యటించారు. స్థానిక 1, 6వ వార్డుల వరకు చెత్త సమస్యలను గమనించారు. అదే విధంగా రైల్వే స్టేషన్ సమీపంలోని పంచాయతీ రాజీవ్ జలాశాయాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఎంపీడీఓ ఎన్ఎస్.ఉమామహేశ్వరరావుతో చర్చించారు. ఈఓపీఆర్డీ రవిశంకర్ మాట్లాడుతూ సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంటు(ఎస్ఎల్ఆర్ఎం)లో భాగంగా కలెక్టరు ఏలూరు జిల్లాలో ఐదు పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారన్నారు. అందులో కై కలూరు ఉందన్నారు. చెత్త, వ్యర్థాల సమస్యలను నివారించడానికి సూచనలను నివేదిక రూపంలో అందిస్తారన్నారు.